# పిల్లల్లారా! మీరేమంటారు!

## డాక్టర్ గూటాల కృష్ణమూర్తి



"ఈ కుక్క జట్టీల లంపటాలు ఇంకా ఎంత కాలమండీ! ఆదివారం పూటవ్వా కులాసాగా ఇంట్లో వుండకుండా, అడ్డమైన వాళ్లతోనూ వూరూరా తిరగడాలూ, మీరున్నూ!" అంది అమ్మ, నాన్నగారు ఇంటికి వస్తూనే.

జవాబుగా చిన్న నవ్వు నవ్వేశారు నాన్నగారు, చేతికర్రనీ, దస్తావేజుల కట్టనీ అమ్మకి అందిస్తూ. వెనకాలే వచ్చిన జటకా సాయిబు ఒక పనసపండూ, పెద్ద చక్కరకేళీ అరటివళ్ల గెలా, సర్వే గొలుసుల మూటా వరండామీద పెట్టేసి వెళ్ళిపోయాడు.

"ఎంత మొత్తుకున్నా నవ్వేకాని జవాబురాదు. చెప్పేం ప్రయోజనం!"

"పోనిద్దూ. ఏదో మనకి చేతనైన ఉపకారం మనం చేస్తున్నాం. ఈ కుక్క జట్టీలే చిలికి చిలికి. చివరికి కోర్టుల చుట్టూ తిప్పిస్తాయి. వీళ్ళేవన్నా లక్షాధికారులా, కోటీశ్వరులా-ఆ ముచ్చట్లు కూడా తీర్చుకోడానికి? మన మాట మీద ఏదో గౌరవం వుండే గదా సాయం చెయ్యమని వస్తారు. అది సరేగాని చూడూ-ఆ దస్తావేజుల్ని ఆఫీసు గది టేబిలు మీద పెట్టు. ఆ రికార్డుల్ని మరోసారి జాగ్రత్తగా చూడాలి" అంటూ తన గది వేపు వెళ్ళిపోయారు నాన్నగారు.

పనిమనిషి గవరమ్మ సర్వే గొలుసుల మూటని కొట్టుగదిలోకీ, పళ్ళని పెరటింటిలోకీ చేరవేసింది.

ఈ లోగా బట్టలు మార్చుకొని, అమ్మ ఇచ్చిన వేడివేడి కాఫీ తాగి నడుం వాల్చారు నాన్నగారు.

అప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయ్యింటుంది.

మిడతల దండులాగా ఇల్లంతా గెంతులేస్తూ, గోలగోల చేస్తున్న సీతాలక్కా దాని నేస్తాలూ, నాన్నగారు ఇంటికి రాగానే-గుప్పుచప్పు అయిపోయి నెమ్మదిగా పెరట్లోకి జారుకున్నారు. అవసరం లేకపోయినా, ఏవేవో పుడకముక్కలుచ్చుకుని పూలమొక్కలకీ, కూరలపాదులకీ గొప్పులు తవ్వేరు. నీళ్ళు తోడి గొప్పుల నిండా పోశారు. ఎంతోసేపు ఉయ్యాల వూగారు. ఉజ్జీలు ఉజ్జీలుగా, ఇద్దరేసి చొప్పున. చివరికి బీర పందెర కింద తుంగచాపలు పరుచుకొని బైఠాయించి, పాటల్లోకి దిగారు.

ఆ వేళ ఆడవాళ్ళ పండగో, లేకపోతే మరేదన్నా ఆడపిల్లల సందడో, నాకు సరిగ్గా గుర్తులేదు. అప్పుడు నాకు అయిదేళ్ళో, ఆరేళ్ళో వుంటాయి మరి. జోగమ్మత్త కూతురు చిన కావేశ్వరీ, ముక్కామల వాళ్ళ కన్నమ్మా, మోదేకుర్తి వాళ్ళ సావిత్రీ, అప్పిగట్ల వాళ్ళ కనకాలూ, చివరింటి ఆచారిగారి అలివేలూ ఇంకెవరెవరో చాలమంది మా సీతాలక్క నేస్తాలందరూ పొద్దుట్నుంచీ మా యింట్లోనే వున్నారు.

మా అక్క సంగీతం నేర్చుకుంటున్నాది కాబట్టి బాగా పాడగలదనే చెప్పాలి. చిన కావేశ్వరి కూడా బాగానే పాడుతుందట. కాని, అది తిక్కమనిషి. దానికితోడు టెక్కు కూడాను. అంచేత దానంతది పాడాలేగాని, దాన్ని పాడమని ఎవ్వరూ అడగరు అయితే సంగీతం నేర్చుకోకపోయినా, ముక్కామలవాళ్ళ కన్నమ్మ పాట ఎంతో కమ్మగా వుంటుంది. అంచేత, దబాయించి మరీ 'ఆ పాట పాడవే' 'ఈ పాట పాడవే' అంటూ కన్నమ్మ చేతే ఎన్నో పాటలు పాడించుకున్నారు సీతాలక్కా వాళ్ళూనూ.

"చీకటి పడుతున్నాదర్రా, ఇంక ఇంటికి రండి" అని అమ్మ పెరటి అరుగు మెట్ల మీంచి చిన్న కేక వెయ్యగానే గభీమని అందరూ లేచి, చాపలు దుమ్ముదులిపి చుట్టారు. వాళ్ళంతా గాభరాగా లేచేరంటే దానికి కారణం వాళ్ళకి మా అమ్మ మీద భయం అని అనుకోకూడదు. అమ్మ మాటలు కాస్త మా నాన్నగారి చెవిన పడితే ఏ ప్రమాదం

ముంచుకొచ్చేస్తుందో! అదే వాళ్ళ భయం. అంచేత రెండోసారి పిలిపించుకోకుండా ఆటలకీ పాటలకీ బుడంబాలు చెప్పేసి ఇంటివేపు పరుగులు తీశారు.

మా నాన్నగారంటే వీళ్ళందరికీఎందుకో అంత భయం!

ఊళ్ళో వాళ్ళకీ భయమేనట. ఎంచేతో మరి!

ముందింట్లో కెళ్ళే గమ్మలు సీతాలక్కకీ వాళ్ళకీ ఎలాగూ లేవు. మానాన్నగారు పెరటింట్లో లేకుండా వుంటే అదేచాలు అంచేత అందరూ మా చిన్న డాబా గదిలోకి దూరిపోయారు. వాళ్ళతో పాటే నేనూనూ. "మీ నాన్నగారు ఎక్కడే?" భయంభయంగా అడిగింది చినకావేళ్వరి మా సీతాలక్కని. అలా భయపడిపోతున్న చినకావేళ్వరి మొగం చూడగానే నాకు ఫకాల్మని నవ్వొచ్చింది. "ఈ గుంట వెధవకి ఎంత పోతరంగావుందో చూడుసీతాలూ. ఏం(రా. మీనాన్నగార్తో ఓసారి చెప్పుమంటావా. ఆ తెగులు అణుగుతుంది?" రోషంగానే అడిగింది చిన కావేళ్వరి "నాకేం భయం లేదులే. ధైర్యం వుంటే వెళ్ళి చెప్పుకో" అని దాని మొగం మీద మరో వెటకారం నవ్వు పారేశాను. "సీతాలూ, వీడు అసాధ్యుడేనే" అంది కనకాలు. చిన్న నవ్వు నవ్వుతూ. మూతి మరీ బిగించేసుకుంది చినకావేళ్వరి.

నాన్నగారంటే నాకేం భయం లేదని అప్పటికప్పుడు రుజువుచేసి చూపించాలని అనిపించింది. దర్జాగా ముందింటి వేపు బయల్దేరాను. సీతాలక్కా వాళ్ళూ హరికను దీపాలు వెలిగించడానికి తలోచెయ్యీ వేస్తూ వుంటే.

నిజానికి నాన్నగారంటే నాకు ప్రత్యేకించి ఏ భయ్యమూ లేదు కాని ఆయన పేరు వినబడగానే అందరూ భయపడ్తూ వుంటే నాకూ భయంగానే వుండేది. ఇంట్లో నాన్నగారు వున్నప్పుడు ముందింటికి వెళ్ళే ధైర్యం నాకూ లేదు. కాని, తీరా బయల్దేరిన వాడ్ని సగం దూరం నుంచే తిరిగొచ్చేస్తే వాళ్ళందరూ నవ్వరూ! 'సరే ఏమయితే అదే అవుతుంది. పద ముందుకి' అని అనుకుంటూ కాళ్ళీడుస్తున్నాను. ఇంతలో తొందర తొందరగా, నాకన్న ముందుగా వెళ్ళి ద్వారబంధాల ముందున్న కొక్కాలకి హరికను దీపాల్ని వేలగడుతున్నాయి గాజుల చప్పుళ్ళ చేతులు వెక్కిరింపు మొగాల్తో నావేపే చూస్తూ.

వీధి వరండాలో, వాలుకుర్చీ బల్లలమీద రెండు కాళ్ళూ చాపుకొని చుట్ట కాలుస్తున్నారు నాన్నగారు చూరువేపు చూస్తూ. ఎదురుగుండా ఓ హరికను దీపానికి చెరోవేపూ కూచొని చిట్టన్నా, కాంబాబూ చదువుకుంటున్నారు. వాళ్ళిద్దరిదీ ఒకే క్లాసు. చదువుకోడానికి రోజూ మాఇంటికే వస్తాడు కన్నమ్మా వాళ్ళ అన్నయ్య, కాంబాబు.

నేను వీధి వరండాలోకి వెళ్ళానేకాని తరువాత ఏంచెయ్యాలో తోచలేదు నాన్నగారితో ప్రత్యేకించి మాట్లాడానికి ఏదీలేదు. ఆయనతో మాట్లాడే అలవాటూ లేదు. ఏం కావాలన్నా అమ్మతోనే చెప్పాలి. మరంచేత ఆ చదువుల దీపం వేపే వెళ్ళి, పక్కగా గోడకి చారబడి నిల్చున్నాను. నన్ను చూసినా చూడనట్టేనటిస్తూ పేజీలు తిప్పేరు చిట్టన్నా కాంబాబున్నూ. ఇంతలో నాన్నగారి చూపు నావేపు వాలింది.

"ఏం కావాలి?" అడిగారు నాన్నగారు. నావేపే సూటిగా చూస్తూ.

"ఏం లేదండీ" అన్నాన్నేను చెవి గోక్కుంటూ.

కావుడూ— తరవాత కొన్సెను వేసాను. ఆ చాప్టరంతా క్షుణ్ణంగా చదవండి."

ఓ హెచ్చరిక వాళ్ళ మొహాన పారేశాక, నాన్నగారు కుర్చీలోంచి లేచి, చుట్టపీకని వీధి కాలవలోకి విసిరేసి, తన గదికి వెళ్ళిపోయారు. మడిపంచ కట్టుకోడానికి, నేను పరుగుల మీద పెరటింట్లో కెళ్ళి, నాన్నగారు భోజనానికి వస్తున్నారని అమ్మతో చెప్పేక దర్జాగా డాబా గదిలోకి వెళ్ళాను. జనానా దర్బారు దగ్గరికి.

నాన్నగారు పెరటింట్లోకి వచ్చినా, వీళ్ళెవ్వరూ ఇళ్ళకి వెళ్ళే ప్రయత్నంలో లేకపోగానే సీతాలక్కవేపు ఆశ్చర్యంగా చూశా. అప్పుడు తెల్సింది— ఆ పూట కూడా వీళ్ళందరి భోజనాలూ మా ఇంట్లోనేనని, పడకలూ ఆ రాత్రి అక్కడే అని. నాన్నగారు భోంచేస్తున్నంత సేపూ డాబా గదిలో గుసగుసలే గాని మాటలు లేవు. చాలా వరకూ సౌంజ్ఞల భాగోతమే జరిగింది.




"ఇలా రా" పిల్చారు నాన్నగారు.

ఇంకా చెవి గోక్కుంటూనే కుర్చీవేపు నడిచాను. 'ఇంక వీడి వీపు సాపయిపోతుంద'నుకుంటున్నట్టూ చిట్టన్నా, కాంబాబూ ఓరచూపులు చూసుకున్నారు.

"బళ్ళో వేసేక. నువ్వు కూడా వాళ్లలాగే చదువుకోవాలి."

"అలాగే నాన్నగారూ"

"వాళ్లనిప్పుడు చదువుకోనీ. పరీక్షలు దగ్గరపడ్డాయి."

"అలాగే నాన్నగారూ"

"మరింక నువ్వెళ్లి, అక్కతో ఆడుకో"

"అలాగే నాన్నగారూ" అని బయల్దేరబోతూ వుంటే పెరటింట్లోంచి అమ్మ కేక వినపడింది. "భోజనానికి మడి కట్టుకోమని నాన్నగారికి చెప్పండి" అని. వెంటనే వెనక్కి తిరిగి :

"నాన్నగారూ, నాన్నగారూ, అమ్మ .."

"విన్నాన్లే. నువ్వు పద. ఒరే చిట్టీ.

నా బడాయీ, మగతనం చూపించడానికి అదే మంచి సమయమని అనిపించింది. వెంటనే—

"ధైర్యంవుంటే ఇప్పుడు వెళ్ళి చెప్పుకో మా నాన్నగారితో." అనంటూ చినకావేళ్వరి మీదికి ఓ చిన్న దబాయింపు బాణం విసిరాను. 'నోరు మూసుకోరా, గుంట వెధవా!' అన్నట్టు కొరకొరా నా వేపు చూసినా, తన చేత్తో తన నోరే మూసేసుకుంది చినకావేళ్వరి. దానివేపు వెటకారంగా చూస్తూ, నాన్నగారంటే నాకేం భయం లేదన్నట్టూ గోటుగా గదుల్లో పచార్లు చెలాయించాను. పొట్టి పేంటు జేబుల్లో చేతులు దూర్చి.

"ఏమే(" పిల్చారు నాన్నగారు

నాన్నగారి గొంతు వినబడగానే గదిలో జనానాలు గాజుబొమ్మలయిపోయారు.

"వస్తున్నానండీ" అంటూ వంటింట్లోంచి పులుసు గిన్నెతో వచ్చింది అమ్మ.

"ఇందాక ఆ పాట పాడింది ఎవరూ?"

"ఏ పాటండీ? పిల్లలందరూ ఏవేవో పాటలు పాడుకుంటూనే వున్నారు."

"అదేనే–'క్షీరసాగరశయన'– పాట".

"ఆ పాటా! అదీ. మన ముక్కామల వాళ్ళ పిల్ల కన్నమ్మ లేదూ! అదే పాడిందండీ ఆ పాట."

"అలాగా! ఎంత శ్రావ్యంగా పాడిందో! చక్కని కంఠానికి జతగా మంచి లయజ్ఞానం కూడా వుంది. అపశ్రుతులు అసలే లేవు. సంగీతం నేర్చుకుంటున్నావా?"

"లేదండీ."

"అదేం. అలాగూ? సంగీతం మేస్టార్ని పెట్టించమని చెప్పలేకపోయావా?"

"కాపరానికెళ్ళాక సంగీత సభలూ, పాటకచ్చేరీలూ చెయ్యాలా. ఏవన్నానా. ఎందుకొచ్చిన సంగీతం?' అని అందండీ, వాళ్ళమ్మ"

"కచ్చేరీలూ, సభలూ చేయించాలనా మనం సీతాలుకి సంగీతం నేర్పిస్తున్నాం?"

"అందరూ మీలాగే ఆలోచిసారా? ఎవరి ఆలోచనలు వాళ్ళవి .. పులుసు కలుపుకోండి. అన్నం చల్లా పోతుంది."

"మహాసముద్రం ఇలా మధనంవయిపోతూవుంటే. అమృతం ఒకట్టి. హాలాహలం ఒకట్టి దాన్నెవరూ తప్పించలేరనుకో కానీ మధ్య మనలాటివాళ్ళు కవ్వం చిలుకుడు తుంపర్లలాగా. చుట్టూ గిరగిరా తిరుగుతూ వుండడమే. కాని సూటిగా ఎటూ పోలేకుండా వున్నాం. ఊపిరి సలపని మన బ్రతుకులకి పది నిమిషాలపాటు మనసు ప్రశాంతంగా వుంచడానికి సంగీతం ఎంతో అవసరమని ఎప్పుడు తెల్సుకుంటారో, మనవాళ్లు!"

"పోన్లెద్దురూ, ఇంత చిన్న విషయానికి అంత లోతుగా ఆలోచించాలా! వాళ్లకెందుచేతో ఇష్టం లేకపోయింది. సంగీతం మేస్టార్ని పెట్టించలేదు. మిగతాది మనకి అనవసరం. అది సరేగాని. మీరు కొంచెం తొందరగా కానివ్వాలి. పిల్లలంతా ఆకళ్ళతో వున్నారు."

"అరెరె! వాళ్లకే ముందు వడ్డించేలేకపోయావా?.... ఊం. ఇంక మజ్జిగ తీసుకురా" తొందరగా భోజనం ముగించి, ముందింటివేపు వెళ్తూ–

"చూడూ. సంగీతం మాస్టారు లేకపోతే పోయె. కాని విధిగా రోజూ సాధనమాత్రం చేస్తూ వుండమని చెప్పు. ఆ ముక్కామల వాళ్ళ పిల్లతో" అన్నారు నాన్నగారు.

మా నాన్నగారి మెప్పుడు మాటలకి కన్నమ్మ ఉబ్బి తబ్బిబ్బయిపోయింది.

ఈలోగా చిట్లన్నా, కొంబాబూ వచ్చారు. అందరం కలిసి భోజనాలు చేశాం. చేతులు కడుక్కుంటూనే వాళ్ళిద్దరూ తిరిగి చదువుల దీపం దగ్గరకి చెరచెరా వెళ్ళిపోయారు. భోజనాల గదీ. వంటిల్లూ క్షణంలో చక్కబెట్టేశారు. సీతాలక్కా వాళ్ళూనూ. అమ్మతో పాటు మేమంతా పెద్ద దాబా గదిలోకి వెళ్ళిపోయాం. అప్పటికి ఎనిమిదో. ఎనిమిదిన్నరో అయ్యుంటుంది.

పది మందిచేత. పదేసార్లు బతిమాలించుకున్నాక. "పాడనుగాక పాడను" అని అంటూనే ఆ "క్షీరసాగరశయన" పాట మళ్ళీ పాడింది కన్నమ్మ. కమ్మగా. సన్నని గొంతులో.


ఉడుకుమోత్తనాన్ని కప్పిపుచ్చుకోడానికి సాకుగా ఏదన్నా కథ చెప్పమని. అమ్మని తన వేపుకి తిప్పుకుంది చినకావేశ్వరి. అమ్మకి ఎన్నో కథలు తెలుసు. ఎంతో బాగా చెబుతుంది కూడానూ. అంచేత కథ వినడానికే అందరం సిద్ధపడ్డాం: "అయితే వినండర్రా" అంటూ–

"అనగా, అనగా ఒక రాజు" అని కథ మొదలుపెట్టిందో లేదో–

"రాజుల కథలు వొద్దత్తా! టంగణాపిల్లి కథ బలే బాగుంటుంది. ఆ కథే మళ్ళీ చెప్పవూ?" ఆశగా అడిగింది కనకాలు.

మిగతా వాళ్ళెవ్వరూ ఆ కథ వినలేదు. కాని సీతాలక్కకి తెలుసు. నేనూ విన్నానట. కాని నాకా కథ బొత్తిగా గుర్తులేదు. మరంచేత నాకూ ఆ కథే వినాలని అనిపించింది. "ఆ కథా. మరో కథా?" అన్న సందేహంలో పడ్డట్టూ కనిపించింది అమ్మ. కాని టంగణాపిల్లి కథే కావాలి. టంగణాపిల్లి కథే కావాలి అంటూ మేమంతా జోరుగానే అరిచి గొడవచేశాం. ఆ సందట్లో, మా నాన్నగారు ఇంట్లో వున్నారన్న సంగతే మర్చిపోయాం. కాని వెంటనే అందరం నాలికలు మాత్రం కరుచుకున్నాం. "మరైతే ఆ కథే చెప్తా" అంది అమ్మ ఇష్టంలేకపోయినా తప్పదన్న గొంతుతో. కథ మొదలయింది– "మేము టంగణాపిల్లిలో వున్నప్పుడు సీతాలూవాళ్ళ నాన్నగారు సముద్రాల ఉద్యోగం చేస్తూ వుండేవారు. ఆ వుద్యోగం చేసినంతకాలం ఎప్పుడూ పల్లెటూళ్ళలోనే పూరికొంపల్లోనే మా కాపరం. ఇద్దరు మగపిల్లల తరువాత నేను మళ్ళీ నెల తప్పాను. సీతాలు కడుపులో పడిందన్నమాట. అప్పటి సంగతిది.

"రోజూ, తెల్లవార్తూనే ఏదో వూరు కమూను వెళ్తూ వుండేవారు వాళ్ళ నాన్నగారు. ఎండల్లో. వానల్లో. పొలాల గట్ల



మీంచి నడక. అదృష్టం బాగున్న రోజు మధ్యాహ్నం భోజనం వుండేది. లేకపోతే పాలో. కొబ్బరికాయ నీళ్ళో ప్రాప్తి. తిరిగి తిరిగి. అలిసిపోయి. ఏ రాత్రికో ఇల్లు చేరుకునేవారు మీ మావయ్య. నేను పిల్లల్ని పక్కలో వేసుకొని. ఆయనగారి కోసం ఎదురు చూస్తూ. అంతవరకూ బిత్తు బిత్తుగ్గా కూచునేదాన్ని ఆయన భోజనం చేసి చుట్ట కాలుస్తూ. మరో గంటో. అర గంటో ఏదో పుస్తకం చదువుకునేవారు. భారత భాగవతాలూ పురాణాలూ ముందు చదివినవే అయినా అప్పుడప్పుడు వాటినే మళ్ళీ తిరగేస్తూ వున్నా ఇంగ్లీషు పుస్తకాల చదువే ఎక్కువ.


"అక్కడ మా పక్కింట్లో 'చల్లా' వాళ్ళని వుండేవారు అతను పౌరోహిత్యం చేసేవాడు. అసలు పేరు ఏమిటో తెలీదుగాని. అతన్ని అందరూ 'మంత్రాల శాస్త్రుల్లు'గారనే పిల్చే వారు. ఆవిడ పేరు కామాక్షమ్మగారు. వాళ్ళకి ఎంతమంది పిల్లలో ఆ లెక్క వాళ్ళిద్దరికీ తెలీకపోవచ్చుని ఎవరన్నా అంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అంతమంది పిల్లలు. 'చాలని కుచేలయ్య' 'చూళ్ళ కుచేలమ్మ' అని వాళ్ళిద్దరికీ తమాషా పేర్లు పెట్టారు మీ మావయ్య వాళ్ళు మాతో చనువుగానే వుండేవారు ఆవిడైతే మరీనూ. పొద్దుటే ఇనప గరిట పట్టుకొని నిప్పు బొగ్గుల కోసం వచ్చిన ఇల్లాలు ఓ గంట పిచ్చాపాటీ వేసేనే కాని కదిలేదుకాదు. ఎప్పుడూ పుట్టింటి గొప్పలే ఆవిడగారి అన్నయ్య ఒక్క పెళ్ళి చేయించేడంటే చాలు—అర డజను గ్లాస్కో పంచల చాపులూ. రాజా రాణీ చీరలూ. నెల్లాళ్ళకి సరిపడ్డ గ్రాసానికి కావల్సిన డబ్బులూ తెస్తాడు. మరా చల్లా ఆయన ఒక అలకరకం చీరా. చేపల



వల్లాంటి పంచల చాపూ, ఓ కొబ్బరికాయా అరడజను కుళ్ళరటి పళ్ళూ పట్టుకొని, నెత్తిమీద గావంచాతో ఇంటికొస్తాడట. ఎంత వెతికినా చిల్లర డబ్బులేగాని మొల్లో ముచ్చటకైనా ఓ కాగితం నోటు ఎప్పుడూ వుండదట. పెళ్ళయినతరవాత కామాక్షమ్మగారు అరటి చెట్టు కాగితాన్ని చూడనే లేదట. పాపం ఆ చల్లా ఆయన గురించి మరీ దిగదుడుపుగా మాట్లాడేది. ఇలాటి కబుర్లే అన్నీనూ. ఆ వల్లెటూళ్ళో నాకదే కాలక్షేపంగా వుండేది. సాయంకాలాలు మరో చిన్నకాలక్షేపం-రోజూ చీకటిపడగానే, ఊరందరికీ వినబడేలాగు మొగుడ్ని ఏవేవో సాధింపులతో ఓ జాడింపు జాడించేసేది కామాక్షమ్మగారు. మేకపిల్లలాగా ఓ మూల కూర్చుండేవాడో యేమో! పాపం! అతని గొంతు ఎప్పుడోగాని పొరుగునేవున్న మాకూ కూడా వినిపించేదికాదు. 'వాళ్ళకి కలిగిందేదో వాళ్ల పెట్టె' 'అబద్ధాలెలా చెప్పగలనే?' 'పోనీలే, ఇదంతా నా ఖర్మ' ఇలాగే ఏవో అప్పుడప్పుడూ అనేవాడు చల్లా ఆయన పెళ్లాం అరుపులకి సమాధానంగా. రోజూ అదో అరగంట కాలక్షేపం. కాని, మేం వుటంగణాపిల్లి వెళ్లిన ఆర్నెల్లకి పాపం, ఏం ముంచుకొచ్చిందోయేమో మరి. ఓ అర్ధరాత్రివేళ ఆ చల్లా ఆయన హఠాత్తుగా 'హరీ' అంటూ కళ్లుమూసేశాడు. మాకందరికీ ప్రాణాలు చివుక్కుమన్నాయి.

"మరి మీ మావయ్య మనస్తత్వం ఇప్పుడూ అప్పుడూ ఒక్కటే. అప్పటికప్పుడు మునసబు కరణాల్ని పిలిపించారు. పది మైళ్ళ దూరంలో వున్న కామాక్షమ్మగారి అన్నయ్యకి, పెద చింతలవలస కబురు పంపించారు వెంటనే రమ్మని. తెల తెలవారుతూ వుంటే, వెళ్ళిన మనుషులు తిరిగొచ్చారుగాని ఆవిడగారి అన్నయ్య మాత్రం రాలేదు. ఏవో తొందర పన్లున్నాయని సాకుచెప్పి కామాక్షమ్మగారి తమ్ముళ్ళందరూ మూరకారాల్లో వున్నారట. మరి చల్లా ఆయనకి దగ్గర బంధువులు ఎవ్వరూ లేరు

"పెద్దమ్మాయి సుబ్బులు పెళ్ళితోపాటే పదేళ్ళ పెద్దకొడుకు సుబ్బిగాడికి ఉపనయనం కూడా చేద్దామనుకున్న శాస్త్రుల్లుగారు ఈ రెండూ జరక్కముందే కన్ను మూసేశాడు. మరిప్పుడు కర్మకాండంతా ఎవరు చేస్తారు? ఆ బాధ్యతా మీ మావయ్యదే అయింది. తరవాత రెండు మూడు రోజులూ చుట్టువట్ల గ్రామాలకి వెళ్ళి, మునసబు, కరణాలతోనూ, పెద్ద రైతులతోనూ చల్లావాళ్ళ విషయం చర్చించారు. మర్నాటి ఆదివారంనాడు మా ఇంట్లో




ఓ పాతిక మంది పెద్దలు పోగయ్యారు. 'ముందూ.... పొయ్యికిందికి పిల్లలు దూరకుండా చూడాలి. ఆ తరవాత ఈడొచ్చిన ఆడపిల్లలిద్దరి పెళ్ళిసంగతీ కూడా ఆలోచించాలి' అన్నారు మీ మావయ్య. 'తమరి నీడ తగుల్తానే మా రయితోల్లి సీదలన్నీ యెగిరిపోనాయి బాబూ, తమరి వుపకారం పొందనోడు ఓడూ నేడు" అంటూ గ్రాసం దండి పోగుచేసే బాధ్యత అక్కుడుపాలెం పెద్దరైతు ఇల్లన్ని చూసుకుంటానన్నాడు. 'సమయానికి నన్నాదుకొని మీరు కాపాడకపోయివుంటే నేనీరోజు నలుగురిలోనూ తలెత్తుకుని తిరగగల్గుండేవాడ్నేనా? తరతమ భేదాలూ జాతి మతభేదాలూ ఏకోశానా లేకుండా కష్టాల్లో వున్న అందరికీ మీరు సహాయంచేస్తున్నారు. తిరిగి ఎంత చేసినా, ఎవ్వరూ మీ రుణం తీర్చుకోలేరు. ఏదో ఉడతాభక్తిగా నేను చెయ్యగలిగిందానిని ఆనందంగా చేస్తాను" అంటూ బొంతలూరు మునసబు, యెగ్గెన్న పంతులు పెళ్లిసంబంధాలు వెతికే బాధ్యత తనదే అన్నాడు. 'మనం అంతా తలో చెయ్యేసి, వేళకి వాళ్ళనాదుకోవాలి, మరి' అన్నారు మీ మావయ్య! ఇంకేం వుంది! వారం రోజులు తిరక్కుండానే వచ్చేశాయి— ధాన్యం బస్తాలూ, పప్పుల బస్తాలూ మిరపకాయల సంచులూ, చింతపండు బుట్టలూ, బెల్లం చక్కీలూ— సమస్తం, ఓ సంవత్సరానికి సరిపడ్డ గ్రాసం.

"బాగానే వుందే, వాళ్ళ పని" అంది, అలివేలు

"పెళ్ళిళ్ళు కూడా చేయించారా యేంటి?" అడిగింది కనకమ్మ.

"మరో ఆరునెల్లకి ఆ పన్లూ జరిగిపోయాయి. సుబ్బిగాడి ఉపనయనంతోసహా" చెప్పింది, అమ్మ.

"అయ్యబాబో! బోల్డంత ఖర్చే అయిందన్నమాట!" ఆశ్చర్యంగా అంది, మోదేకుర్తి వాళ్ళ సావిత్రి.

"ఖర్చులకేంగాని, మగపెళ్ళి వాళ్ళ టెక్కూ, నీలుగులూ, అలకలూ, ఆడపెళ్ళి వాళ్ళు వెళ్ళి బతిమాలుకోడాలూ— వాటిన్ని తల్చుకున్నప్పుడల్లా నవ్వొస్తూ వుంటుంది. మీ మావయ్యా, నేనే కన్యాదాతలం మరి. అంటే మేమే ఆడపెళ్ళివాళ్ళన్నమాట. ఇంక చూసుకో -మా హడావిడీ, ఆందోళనానూ మా చేతుల మీద జరిగిన మొదటి పెళ్ళిళ్ళు అవే మరి" నవ్వుతూ అంది అమ్మ

,"

"మరికొన్ని పెళ్ళిళ్ళు కూడా చేయించారా?" ఆతృతగా అడిగింది, అలివేలు.

"సీతాలూ, ఇప్పుడు తెలుస్తున్నదే -మీ నాన్నగారంటే అందరికీ అంత భయం, గౌరవం ఎందుకుందో! భూముల తగాదాల్లో, ఎప్పట్నుంచో మాటలు కూడ మానేసుకొని, కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి రెండేసి అంగుళాలు పొట్టైపోయిన మా నాన్న, చిన్నాన్న ఇప్పుడు "ఏంరా, అన్నయ్యా" అంటే "ఏంరా, తమ్ముడూ" అనుకుంటూ ఎంతో హాయిగా, ఆనందంగా వున్నారు అప్పుడెప్పుడో మీ నాన్నగారే కలగచేసుకొని వాళ్ళిద్దరికీ రాజీ చెయ్యకపోతే ఇప్పటికీ వాళ్ళ మొగాలు ధుమధుమా దుమ్మలముచ్చు మొగాల్లాగే వుండేవి" అంది, మోదేకుర్తి వాళ్ళ సావిత్రి

"మీ అడ్డు ప్రశ్నలూ, పిట్ట కథలూ బంగారంకానూ, ఆపండర్రా మీగొడవ వినవలసిన అసలు కథంతా ముందే వుంది. చెప్పత్తా కామాక్షమ్మగారు తరువాత ఏంచేశారో అది చెప్పత్తా. బలె గమ్మత్తుగా వుంటుంది" అంది, కనకాలు.

"సరే, ఆ చల్లా శాస్త్రుల్లుగారు చల్లగా వెళ్ళిపోయాడు, గావంచా దులుపేసుకుని కానీ పాపం, కామాక్షమ్మగారి కడుపులో మంట ఎలా చల్లారుతుంది! రాత్రుళ్ళు పిల్లలు భోజనాలు చేసి నిద్రపోగానే ఆవిడగారు వీధి అరుగుమీద కూచొని, రోజూ భోరుమని ఏడుస్తూ వుండేది. "నాకేం దార్రా భగవంతుడా? ఈ చీంవల పుట్టని నేనెలా పెంచదంరా దేవుడా?" అంటూ తెల్లవార్లూ అదే వరస. వారం కాదు, పదిరోజులు కాదు, నెల్లాళ్లు దాటిపోయినా రోజూ అదే యేడుపు. నెలలు ముసుర్తున్నా. నేను వెళ్ళి రోజూ ఏవేవో నిబ్బరం మాటలు చెబుతూ వుండేదాన్ని. కాని ఏంలాభం? ఆవిడగారుమాత్రం ఏడుపు మాన్లేదు. ఇన్ని రాత్రులూ మీ మావయ్యకి శివరాత్రులే అయ్యాయి. పగలంతా వూళ్ళు తిరగడం, రాత్రుళ్ళు నిద్రలేకపోవడం, ఇలా సతమతమయిపోతూ వుండేవారు. ఎలాగైనా నచ్చచెప్పి

రాత్రుళ్ళు ఏడుపు ఆమెచేత మాన్పించే ఉపాయం ఏదన్నా ఆలోచించమని ఓసారి నాతో చెప్పారు. "పాపం. ఆవిడ తీరని కష్టంలో వుంది. మనం మరికొంచెం ఓపిక పట్టాలేమోనండీ" అని అన్నానేను. "మరికొంచెం అంటే సరిగ్గా ఇంకెన్ని రోజులూ" అంటూ సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ అడిగారు. నాకు నోరు పెగల్లేదు. మరో పది రాత్రులు దాటాయి కాని ఆవిడ గారిలో ఏ మార్పూ రాలేదు. నిదరపట్టక మీ మావయ్య చుట్ట మీద చుట్ట కాలుస్తూ ఏదో ఆలోచిస్తూ ఇంట్లో పచార్లు చెయ్యడం మొదలుపెట్టారు. రాత్రుళ్ళు రోజూ ఇదేపని.

"మన్నాడు ఉదయం బిళ్ళ బంట్రోతు పర్వతాలు వస్తూనే వాడిచేత కామాక్షమ్మగారి కేదో కబురు పంపించారు. తను చెప్పిందంతా పూర్తిగా చెప్పమనీ. మర్యాదగానే చెప్పమనీ. మరీ మరీ చెప్పి పంపించారు. మరా కబురు ఏవిటోగాని అది కొంత వరకూ పనిచేసింది. ఆ రాత్రి నుంచి కామాక్షమ్మగారు వీధి అరుగు మానేసి. పెరట్లో బాదం చెట్టుకింద కూచ్చొని ఏడుస్తూవుండేది ఆ విషయం తెల్సాక మీమావయ్యా.నేనూ ఎంతో నొచ్చుకున్నాం. ఆయనగారు ఏవేవో పురాణాలూ. ఇంగ్లీషు పుస్తకాలూ తిరగెయ్యడం మొదలుపెట్టారు- కామాక్షమ్మగారి బాధ మాన్పించడానికి ఏదన్నా మార్గం కనిపిస్తుందేమోనని. ఇలా మరో వారం రోజులు గడిచాయి. అక్కడ కూచ్చొని ఏడుస్తున్నందువల్ల ఆమెకి ఇబ్బంది కలిగిందేగాని మాకు నిద్దర పట్టడానికి లవలేశమైనా అవకాశం కలగలేదు. అసలే పాము చెవులు మీ మావయ్యవి మరి. పెరట్లో ఏడ్చినా. పక్కనే కూచ్చొని ఏడుస్తున్నట్టూ వుండేది ఆయనగారికి. పగటివేళ నేనో చిన్నకునుకు లాగేస్తూవుండే దాన్ని కాబట్టి వారికున్నంత బాధ నాకుండేది కాదు.

"ఈలోగా జమాబందీ రోజులు ముంచుకొచ్చేసాయి. నిద్రలేదు సరికదా. వేళ వట్ల భోజనానికి కూడా వీలు చిక్కని ఏవో లెక్కలూ. రాతకోతలూ. ఎక్కడెక్కడున్నంచో మునసబు. కరణాల రాకపోకలూ. అప్పటికే చిక్కి శల్యం అయిపోయారు మీ మావయ్య. జమాబందీ లెక్కలు అప్పగించడానికి పట్నం వెళ్ళి మూడు రోజుల్లో తిరిగొచ్చారు.కాని వచ్చేం లాభం? బాదం చెట్టు కింద ఏడుపు ఎప్పట్లాగానే వుంది.

"ఆ రాత్రి భోజనం చేస్తూ అన్నారు: 'రోజూ ఆనందించే ఆనందాల్లో నిజమైన సుఖం లేనట్టే రోజూ ఏడ్చే ఏడుపుల్లో నిజమైన దుఃఖమూ వుండదు. సుఖదుఃఖాలు వస్తూ వుంటాయి. పోతూ వుంటాయి. కాని ఏ ఒక్కదాన్నో పట్టుకొని ఎల్లప్పుడూ వేల్లాడాలని అనుకున్న వాళ్ళు మామూలు మనుషులుగా బతకడానికి ధైర్యం లేనివాళ్ళనో. అసలు అలా బతకడానికి ఇష్టపడని వాళ్ళనో అనుకోవాలి"అని నాకు అవే ఏదో వేదాంతం మాటల్లాగా అనిపించాయి దానికి తోడు మరో రెండు నిముషాలు ఇంగ్లీషులో ఏదో ఉపన్యాసం దంచేశారు నేను బిక్కమొగంవేసి కూచున్నాను- "ఏమిటిదంతా భగవంతుడా"అని అనుకుంటూ. అలా కూచున్న నన్ను చూసి చిన్న కొంటె నవ్వు నవ్వేరు మీ మావయ్య. అప్పటిగ్గాని నా మనసు మళ్ళీ కుదటపడలేదు. నేనూ చిన్న నవ్వు నవ్వేశాను. జవాబుగా ఆయన నన్ను మాటల్లోకి దించుతూ అడిగారు.

"ఏమేం! అయితే పాపం. ఆవిడకి తీరని కష్టం వచ్చిపడింది కదూ!"

"కాదండీ! మరీ: ఆడదానికి భర్తేకదండీ సర్వస్వమూనూ!"

"అందుకే పాపం.అలా మారిపోయింది"

"అంతేనండీ మరీ."

"కాదే" అన్నారు. మళ్ళీ చిన్నగా నవ్వుతూ.

"అదేంటండీ.అలా అంటారు?"

"ఆవిడగారి బాధ మొగుడు చచ్చిపోయి నందుకు కాదే."

"మరింకెందుకండీ?"

"ఆవిడగారు రోజూ కురిపించే తూటాగుళ్ళ దెబ్బలు తింటూ. మాట్లాడకుండా ఓ మూల కూచ్చోడానికి ఇప్పుడెవరూ లేరుగా! అందుకే ఆ బాధా. ఏడుపున్నూ."

"బాగుందండీ మీ పరిహాసం".

'ఉష్ణం ఉష్ణేన శీతలం' అన్నారు. తట్టుకోలేని మహాప్రమాదం మరేదన్నా ముంచుకొస్తేనే కాని ఆమె తిరిగి మామూలు మనిషిగా మారదే."

"అదేంటండీ! కష్టంమీద మరోకష్టమా! పరాయివాళ్ళకైనా అలాటి పరిస్థితి రాకూడదనే మనం ఆశించాలి"

"మనకి పరాయివాళ్ళెవరే? మనుషులందరూ మనవాళ్ళేనే-" అంటూ కంచంలో చెయ్యికడుక్కొని. ఎప్పుడూ లేంది.వంటింట్లోకి వెళ్ళేరు. ఏం కావాలో అని వెనకాలే నేనూ వెళ్ళా గబగబా బస్తాలోంచి బొగ్గులు తీసి ఓ పెద్ద సంచీలో పోశారు. అందులోనే ఓ పెట్టకుంపటీ.చిన్న విసనకర్రానూ."అగ్గిపెట్టెఎక్కడుందే?"ఓ కేక వేశారు.నేనుపక్కనే వున్నా గూట్లోంచి అగ్గిపెట్టె తీసి ఇచ్చా. దాన్ని కూడా ఆ సంచీలోనే పడేసి. పెరట్లోకి దారితీశారు-సంచీతోసహా "చూడూ. నేను తొందర్లోనే వచ్చేస్తాగాని నువ్వు మాత్రం గాభరాపడిపోకు" అంటూ ఆ చీకట్లో మరి కనిపించకుండా వెళ్ళిపోయారు. కళ్ళు చించుకుంటూ నేను నాలుగడుగులు వెళ్ళాను అంతా చీకటి ఆయన ఎటెళ్ళేరో! ఏం చెయ్యాలో తోచక. అయోమయంగా అక్కడే నిలబడిపోయాను. ఇంతలో వినీ వినిపించని చిన్న చిన్న చప్పుళ్ళు. వాటిని బట్టి తెల్సుకున్నాను — మీ మావయ్య ఆ బాదం చెట్టు ఎక్కుతున్నారని. నాకు మరి కాలు ముందుకి కదల్లేదు నోరు పిడచకట్టుకుపోయింది ఒళ్ళంతా ముచ్చెమటలూ పట్టేశాయి ఎలా తిరిగొచ్చానో యేమో మరి మెట్లెక్కి. పెరటి అరుగుమీదవాలిపోయాను.కోపంలో ఆయన ఏ అఘాయిత్యం చేసేస్తారో అన్నభయంతో గుండెలు దడదడా కొట్టుకోడం ప్రారంభించాయి ఒంట్లో జవసత్తువులు అప్పుకుపోయాయి. ఇంతలో ఆ చెట్టుమీద కనీ కన



ఆకాశవాణి వార్షిక పోటీలలో 1983వ సంవత్సరానికి విజయవాడ కేంద్రానికి ప్రథమ బహుమతి తెచ్చిన "నాద బంధం" సృజనాత్మక రూపకాన్ని రూపొందించిన బృందంలో శ్రీ కె. కృష్ణమోహన్. శ్రీ వీరభద్రరావు. శ్రీ వన్నెల సుబ్రహ్మణ్య భట్టు. శ్రీ మాడుగుల రామకృష్ణ. స్టేషన్ డైరెక్టర్ శ్రీ పి. ఆర్. రెడ్డి (మధ్యన వున్నారు)

## సుభాషితాలు

అసూయ కనబరచడం అంటే మన స్ఫూర్తిగా ముఖస్తుతి చెయ్యడం.

—కాలిన్స్

* * *

వార్ధక్యంతో పాటు జ్ఞానం కూడా సంప్రాప్తిస్తుందనుకోవడం కల్ల. ఈ నిజం ముసలివాడినయ్యాక తెలుసుకొన్నాను.

—మెన్ కెన్

* * *

మనం ముసలివాళ్ళం అవడంలో విషాదం లేదు. ఇంకా యువకులుగా వుండడానికి చేసే ప్రయత్నంలో వుంది విషాదం.

—ఆస్కార్ వైల్డ్

* * *

యౌవనం గతించినప్పుడు. నడివయస్సు వీడ్కోలిచ్చినప్పుడు మానవుడు కన్నీరు కార్చడం మరచిపోతే మనకు మహా కావ్యాలుండవు.

—ఉమర్ ఖయ్యాం

* * *

మన జీవితాలు మొదటి సగం తల్లిదండ్రులూ. చివరి సగం సంతానమూ ధ్వంసం చేస్తారు.

—ఒక సామెత

* * *

పెదమనుషుల ప్రపంచమంతా ఒకటే. పోరంబోకులలోనే వైవిధ్యం చూడగలం.

—షా

ఇతరులకంటె యెక్కువ మంచిగా కనబడడానికి యత్నించే వ్యక్తి చెడ్డవాడు

—ఎఫ్. హెచ్. బ్రాడ్లే

* * *

మనుషులమైనందుకు మనం మంచో, చెడో యేదో ఒకటి చెయ్యాలి. ఏదో చెయ్యడంవల్ల మనం సజీవులమై వున్నట్లు తెలుస్తుంది.

—టి. ఎస్. ఎలియట్

* * *

మంచువంటి పవిత్రత నీలోవున్నా నింద తప్పదు.

—షేక్స్‌పియర్

* * *

చెడ్డపని చేసే వత్తువ లేక. మంచి సలహాతో విసిగిస్తాడు వృద్ధుడు,

—లారోషిఫో కాల్డ్

—ఐ. మహాలక్ష్మి. శ్రీకాళహస్తి

పడని చిన్న వెలుగు వెలిగింది. అగ్గిపుల్ల వెలుగు ఆవెలుగు కనబడగానే నా వొళ్ళంతా కొంకర్లెక్కిపోయాయి ఎత్తుగా. చెట్టు టారు కొమ్మమీద కూచున్నారన్నమాట. మీ మావయ్య. ఆ చీకట్లో కాలుజారినా. పట్టుతప్పినా ఇంకేమన్నా వుందా! ఒకటే గాభరా. ఒకటే గుండెదడ. చేసేది ఏదీలేక. శూన్యంగా ఆ బాదంచెట్టు వేపే చూస్తూ గోడకి చారబడిపోయాను.

"అప్పుడు ఎన్ని గంటలయింటుందో తెలీదు. తొమ్మిది అయితేనేకాని కామాక్షమ్మగారు బాదం చెట్టు దగ్గరికి వెళ్ళరు. అక్కడికి ఆమెగారు ఎప్పుడెళ్ళిందో తెలీదు గాని మరో పది నిమిషాలకి చిన్న చిన్న వెక్కిలు వినబడ్డాయి. పేగుల మడతల్లో. ఎక్కడో వున్న బాధని కెలికి బైటికి లాగుతున్నాదన్నమాట మరో పది నిమిషాలకి మొదలయింది 'నాకేందార్రా. భగవంతుడా!' ఏడుపు. అలా ఓ అరగంటసేపు ఆవిడ ఏడ్చుంటుందేమో! ఇంతలో— ఏం చెప్పనూ?" అని. తోసుకొస్తున్న నవ్వుని చీర కొంగుతో కప్పుకుంటూ కథ చెప్పడం ఆపేసింది అమ్మ.

"చెప్పత్తా. చెప్పూ. కథ మాంచి పట్టులోకి రాగానే ఆపేశావు" బతిమాలింది కనకాలు.

"చెప్పండీ." ఆతృత పెరిగిపోతూ అడిగింది అలివేలు.

"చెప్పమ్మా!" మరింక ఆగే ఓపిక లేదన్నట్టూ అన్నానేను

ఇంకా తోసుకొస్తున్న నవ్వుని ఆపుకుంటూనే కథ మళ్ళీ అందుకుంది అమ్మ.

"ఏం చెప్పనూ! ఏవేవో అర్థం పర్థం లేని అరుపులు అరుస్తూ. కామాక్షమ్మగారికి రెండు మూడు గజాల దూరంలో పడేటట్టూ కణకణామండుతున్న బొగ్గుల్ని అమాంతంగా కుంపట్లోంచి గిరాటువేశారు మీ మావయ్య. దాంతో ఆవిడగారు గాభరాపడిపోయి "అమ్మో. బాబో. దెయ్యం. దెయ్యం. కొరివిదెయ్యంరా బాబూ. కొరివి దెయ్యం" అని గొంతుగుడు అరుపులు అరిచి. "ధబ్బు" మని నేలమీద కూలిపోయింది.

"ఒసే. కామీ! భయపడిపోకే. దెయ్యాన్నీ కానూ. భూతాన్నీ కాను నేను నీ మొగుణ్ణేనే.

"లే. నిలబడూ. జాగ్రతగా వినూ. ఓ ముఖ్యమైన విషయం నీతో చెప్పమని దేవేంద్రుడు పంపిస్తే వచ్చాను లే మరి" అన్నారు మీమావయ్య మా చమత్కారంగా. అచ్చంగా ఆ చల్లాశాస్త్రుర్లుగారిగొంతులోనే. "మీరేనా అండీ! నిజంగా మీరేనా అండీ! వచ్చేసేరా అండీ! మరింక భయపడనండీ. చెప్పండీ వింటున్నానండీ!" అంది కామాక్షమ్మగారు.

మీ మావయ్య మళ్ళీ లంకించుకున్నారు:—

"ఒసే. కామీ! నేను చచ్చిపోగానే యమదూతలు వచ్చి. నన్ను యెముడి దగ్గరికి గొరగొరా లాక్కుపోయారే. యమధర్మరాజు నన్ను ఎగాదిగా చూసాడే. సిగ్గుతో తల వంచుకొని.నాకు నమస్కారంపెట్టేడే. ఆ యమదూతలకి చీవాట్లుపెట్టి. "ఇతని భార్యని తెమ్మంటే. ఇతన్నెందుకు తెచ్చారూ?" అంటూ గర్జించాడే....

"అమ్మో! నన్నే! అప్పుడే! యమలోకానికే!"

"చెప్పిందంతా పూర్తిగా వినే."

"చెప్పండి. నన్ను తీసుకురమ్మని యెముడు మిమ్మల్ని పంపించలేదు కదూ!"

"వినే. ముందూ. 'పొరపాటు ఎలాగూ జరిగిపోయింది. ఇప్పుడు ఇతన్ని భూలోకానికి తిరిగి పంపడం సాధ్యం కాదు. కాని. ఈ శాస్తుర్లుగారు ఎంతో మంచి మనిషి. ఎన్నో పుణ్యాలూ. సత్కార్యాలూ చేయించాడు స్వార్థంలేని మహాపురుషుడు. మహాశీల సంపన్నుడు. వెంటనె వీరికి మీరు క్షమార్పణలు చెప్పుకొని. తక్షణం స్వర్గానికి స్వయంగా తీసుకెళ్ళి వీరిని దిగబెట్టండి' అన్నాడు యెముడు. నేను స్వర్గానికి చేరుకోగానే స్వర్గపాలకులు నాకు పాదాభివందనచేసి. "లోపలికి దయచెయ్యండ"ంటూ తలుపులు తెరుస్తూ వుండగానే లోపట్నుంచి దేవేంద్రుడి కేకలు వినబడ్డాయి. "ఆ చల్లా శాస్తుర్లుగారిని లోపలికి రానివ్వకండి. అతన్ని తిరిగి యమలోకానికే పంపించెయ్యండి. ఇతను మంచివాడే. స్వర్గంలో వుండదగ్గవాడే. కాని ఇతని మంచితనానికి మహాకళంకం తెచ్చిపెట్టింది ఇతని భార్య. ఇతను జన్మరాహిత్యం పొందిన దగ్గర్నుంచీ ఆమె తెగఏడుస్తూ. అక్కడ ఊళ్ళో వాళ్ళనీ. ఇక్కడ నన్నూ వేధించేస్తున్నాది. తెగ బాధించేస్తున్నాది. వాళ్ళకీ నాకూ కూడా కంటిమీద కునుకు వాలకుండా కాల్చుకు తినేస్తున్నాది. బతికున్నంత కాలం ఈ ఉత్తముడి ప్రాణాల్ని గోలికి గోలికి గుల్ల చేసేసింది. ఎంత మంచివాడైనా. ఇతని భార్య ఏడుపు మానే వరకూ ఇతనిక్కడ వుండడానికి వీల్లేదు" అంటూ పిడుగుల్లాటిమాటలు కురిపించేశాడే. అప్పుడు నేనెలాగో ధైర్యం చేసి పరుగుల మీద వెళ్ళి దేవేంద్రుడి కాళ్ళమీద పడ్డాను కానీ. కానీ... "

"అయ్యో. మీగొంతు బొంగురుపోయిందెందుకండీ? "కానీ" అని వూరుకున్నారేవండీ? ఏమన్నాడండీ ఆ ఇంద్రుడూ? చెప్పండీ"

"ఎలా చెప్పగలనే కామీ. దుఃఖం

ముంచుకొచ్చేస్తూవుంటే!"

"ఏం చెప్పేడండీ?"

"నిన్నూ.... నిన్నూ.... నిన్నిప్పుడు చంపేసి. యమలోకానికి పంపించేస్తానన్నాడే."

"అమ్మో! ఇంద్రుడూ అదే మాటన్నాడండీ? అయ్యో. నా రాతా! నాకింకేం దిక్కురా నారాయణమూర్తీ!"

"ఏడవకే కావీ! ఏడవకు. ఇంద్రుడలాగంటే నేను నోరు మూసుక్కూచున్నానా!

"ఒద్దు స్వామీ. ఆ పని చెయ్యొద్దు. పిల్లలవాడ్ని. ఒక్క అవకాశం నాకు ఇప్పించండీ. నా భార్యకి నచ్చచెప్పుకుంటాను" అని ప్రార్థించాను. అప్పుడు ఇంద్రుడు ఓక్షణం ఆలోచించి. "సరే. అయితే కొన్ని షరతులు విధిస్తున్నాను. వాటికి నీ భార్య అంగీకరిస్తే కటాక్షిస్తాను. భూలోకం వెళ్ళి నీ భార్యకి నచ్చచెప్పడానికి నీకు ఒక అరగంట మాత్రమే వ్యవధి ఇస్తున్నాను" అని చెప్పి. నన్నీ బాదంచెట్టు మీదికి పంపించాడు

"కటాక్షిస్తానన్నాడా అండీ? నిజంగా కటాక్షిస్తానన్నాడా అండీ? అయితే తప్పకుండా అంగీకరిస్తానండీ. ఏమిటండీ ఆ షరతులూ చెప్పండీ."

"నువ్వు నిజంగా అంగీకరించి. శిరసావహిస్తే. నా షరతుల ఫలితంగా నువ్వూ స్వర్గలోకానికే వసావట."

"భర్త అడుగుజాడల్లోనే వుండాలి కదండీ. భార్య ఎప్పుడూను! కాని ఆ షరతులేవిటో చెప్పండీ. తప్పకుండా శిరసావహిస్తానండీ!"

"ముందుగా నువ్వు ఏడుపు మానేయాలట!"

"తక్షణం మానేస్తానండీ., అప్పుడే మానేశాను కదండీ!"

"నేను బతికున్నంత కాలం నన్ను నువ్వు తిట్టినతిట్లకి క్షమార్పణచెప్పాలట!"

"క్షమించండీ- మరింకెప్పుడూ పల్లెత్తు మాటనాను అన్నండీ!"

"క్షమార్పణ నాకు కాదే- ఆ దేవేంద్రుడికి చెప్పాలట!"

"మహేంద్రా! దేవదేవా! మహాపచారం చేశాను. క్షమించు తండ్రీ క్షమించు"

"లెంపలేసుకోవాలట"

"ఇదిగోనండీ లెంపలేసుకుంటున్నాను. వినపడిందా అండీ?"

"వినపడిందిలే. నువ్వు మరి అందరితోనూ మంచిగా ఉండాలట."

"అందరితోనూ నేను మంచిగానే వుంటానండీ"

"ఇంక జాగ్రత్తగా విను కావీ. నువ్వీ షరతులు పాటించకపోతే నన్ను మళ్ళీ



ఎమర్జన్సీ చీకటి రోజుల్లో అరెస్టయి. 13 నెలలు చిత్ర హింస అనుభవించిన "బరోడా డైనమైట్" శ్రీ విక్రమ్‌రావు భారత వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (ఐ. ఎఫ్. డబ్ల్యు. జె.) అధ్యక్షునిగా ఎన్నికైన తొలి తెలుగువ్యక్తి. జర్నలిస్టు ప్రపంచంలో మకుటం లేని మహారాజుగా విరాజిల్లిన కోటంరాజు రామారావు కుమారుడైన శ్రీ విక్రమ్‌రావు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధిగా వున్నారు.

భూలోకానికే తోసేస్తారట. ఇక్కడే వుండి ఇప్పట్లో నీ మీద నిప్పులు కక్కుతూ వుంటానట నువ్వు చచ్చేవరకూ మరి నా పని అదేనట. అప్పుడు నువ్వు యమలోకానికి. నేను స్వర్గలోకానికి వెళ్తావట. కానీ.... నువ్వు చేసిన తప్పులకి పశ్చాత్తాపపడితే దాని ప్రతిఫలం నీకు భూలోకంలోనే దొరుకుతుందట.

అయితే.... నువ్వు చేసిన పాపాల ఫలితం మాత్రం యమలోకంలో ముందుగా అనుభవించి తీరాలట!"

"ఏమండీ. తెలీక అడుగుతున్నాను గాని ఇంద్రుడు గొప్పవాడా. యముడు గొప్పవాడా అండీ?"

"ఇంద్రుణ్ణి మించిన వాడు ఎక్కడా లేదే కావీ"

"ఏమండీ మీరు ఎలాగూ స్వర్గంలోనే వుంటారు కదా. మరలాగైతే ఇంద్రుడ్ని ఎలాగయినా మంచి చేసుకుని మెల్లిగా నచ్చచెప్పి. నన్ను యమలోకానికి పంపించకుండా ఏదన్నా చెయ్యలేరా అండీ?"

"నా ప్రయత్నాలు నేను చేస్తాను కాని నువ్వు మాత్రం నీ మాట నిలబెట్టుకోవాలి."

"తప్పకుండా నిలబెట్టుకుంటానండీ"

"అలా అనేస్తే చాలదే."

"మరింకెలా అనాలో చెప్పండీ!"

"మన పిల్లలందరి మీదా ఒట్టేసి చెప్పాలి."

"మన పిల్లలందరి మీదా ఒట్టండీ"

"మీ అన్నయ్యమీద ఒట్టేసి చెప్పాలి"

"మా అన్నయ్యమీద ఒట్టండీ"

"మరి మీ తమ్ముళ్ళో!"

"మా తమ్ముళ్ళందర్నీమీద ఒట్టండీ!"

"అయితే సరే. ఇదంతా నేను ఇంద్రుడితో చెప్తాను. ఇంక నువ్వు వెళ్ళి నోరు మెదపకుండా పడుకో"

"అలాగేనండీ. కాని. ఏమండీ."

"మళ్ళీ ఏం వచ్చిందే?"

"ఎలాగూ వచ్చారుగదా. ఒక్కసారి కనిపించండీ. కళ్ళారా చూసి ఆనందిస్తానండీ"

"ఓసి పిచ్చిమొద్దా. చచ్చిపోయినవాళ్ళు నిరాకారులే– గాల్లో కలిసిపోయి తేల్తూ వుంటారు!"

"అలాగా! పోనీలెండి. మాట వినిపించింది అదే పదివేలు. కానీ. ఏమండీ"

"నీ కోరికల్తో నన్నిక్కడే ఆపేసేలాగున్నావ్ కాలాతీతం అయిపోతున్నాది. కానీ. అదేదో తొందరగా అడుగు. ఊ!



"నేనొక్కర్తినే పిల్లల్ని ఎలా పెంచగలనండీ! నాకు ధైర్యం చిక్కటం లేదండీ."

"మళ్ళీ మొదటికే వచ్చావు; చెప్పిందంతా మర్చిపోయి. మళ్ళీ చెబుతున్నా— అందరితోనూ మంచిగా వుంటే నీకే భయమూ వుండదు. మన పక్కింటి సముద్రాలుగారు లేరూ! వారూ, వారి భార్యా ఎంతో మంచివాళ్ళు. వాళ్ళతో నువ్వు మరీ మంచిగా మసలుకోవాలి. వాళ్ళు తప్పకుండా సాయపడతారు. ఆ సంగతి నువ్వు బాగా గుర్తుంచుకోవాలి సుమా! మరి వెళ్ళు. వెళ్ళు మరీ. అదుగో. అప్పుడే నన్ను గాలి మీదికి లాగేస్తున్నాది. నేను వెళ్తున్నా. కామా కా.."

"ఏఁవండోయ్. నా సంగతి మర్చిపోకండేం! ఆ ఇంద్రుడికి నచ్చచెప్పండీ!" అని అరుస్తూ, కామాక్షమ్మగారు పరుగుల మీద ఇంట్లోకి పోయింది. కాని నేను మాత్రం అంతసేపూ చెప్పలేనంత తికమకలో పడిపోయాను. ఓ ప్రక్క మీ మావయ్య ధైర్యానికీ, చమత్కారానికీ నవ్వూ, మరో పక్క కామాక్షమ్మగారి అమాయకపు అవస్థకి ఏడుపూ. గట్టిగా నవ్వినా, ఏడ్చినా మీ మావయ్యగారి నాటకం అంతా రసాభసై పోతుందన్న భయమూ"

"మరప్పుడు మీరేం చేసేరండీ?" ఆతృతగా అడిగింది కన్నమ్మ.


"ఏం చేస్తానూ! గొంతుమొయ్యా చీర కొంగు కుక్కేసుకొని, రెండు చేతులతోనూ గూనంత పొట్టనీ అదిమి పట్టుకున్నాను."

"అబ్బ. కథ చెప్పమ్మా" గునిసాన్నేను.

"ఇంకేఁవుందీ! మరో అరగంట వరకూ ఆయన అక్కడే వుండి, మరింక కామాక్షమ్మగారు అటు రారని విశ్వయించుకున్నాక, చడీచప్పుడూ లేకుండా, బాదం చెట్టుదిగి ఇంటికొచ్చారు. మరా రాత్రినుంచీ కామాక్షమ్మగారు ఏడుస్తే ఒట్టు. కానీ.... కనకాలూ.... ఈ సంఘటన గుర్తుకొచ్చినప్పుడల్లా చిన్ననవ్వు వచ్చినా, ఏదో బాధ కడుపులో పీకుతూనే వుంటుందే" అంటూ చెమ్మగిల్లిన కళ్ళని చీరకొంగుతో తుడుచుకుంది, అమ్మ.

"బాధెందుకండీ?" ఆశ్చర్యంగా అడిగింది. అలివేలు.

"కామాక్షమ్మగారి విషయంలో ఆ వేళ మావారు చేసింది అంత మంచిపని కాదేమోననేనే, అలివేలూ." అని అమ్మ చెప్పడం పూర్తిచేసిందో లేదో-



గది బయట చిన్న దగ్గు వినిపించింది- నాన్నగారి దగ్గు. గతుక్కుమని అందరం తలుపువేపు తిరిగాం. ఎత్తుగా, ద్వారబంధానికి అవతలవేపే ఓగజందూరంలో నిలబడి వున్నారు నాన్నగారు. అప్పుడు తట్టింది నాకు. 'టంగణా పిల్లికథే కావాలి' అంటూ జోరుగా అరిచిన మా గోలే నాన్నగారిని ఇటువేపు తీసుకొచ్చివుంటుందని. మేఁవంతా నోళ్ళు ఆ బెట్టుకొని, నాన్నగారివేపే చూస్తూ బొమ్మల్లాగా వుండిపోయాం.

అమ్మకంట తడి కనిపించినందుకో, మరింకెందుకో తెలీదు కాని, నాన్నగారి కనుకొలకుల వరకూ ఎలాగో చేరి, మరి జారలేక, జాలిజాలిగా చూస్తూ, అక్కడే ఆగిపోయిన నీటి బొట్లని దులుపుకున్నారు మా నాన్నగారు. నెమ్మదిగా అడుగులు వేస్తూ మా గదిదగ్గరకివచ్చి, ద్వారబంధాన్ని రెండువేపులా పట్టుకొని ఏదో ఆతృతగా మా అందరివేపూ చూసి సూటిగా నెమ్మదిగా అడిగారు మా నాన్నగారు—

"పిల్లల్లారా! మీరేఁవంటారూ?" అని.